గడప దాటని జనం

- రోజంతా కురిసిన జడివాన
- స్తంభించిన జనజీవనం
- చిరు వ్యాపారులకు తిప్పలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

చిత్తూరు కార్పొరేషన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. నగరంలోని మిట్టూరు జిల్లా అటవీశాఖ కార్యాలయం సమీపంలో చినుకుపడితే అవస్థలు తప్పడం లేదు. ఇటువైపుగా అగ్నిమాపక, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈల కార్యాలయాలకు నిత్యం పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం వస్తే అటవీశాఖ కార్యాలయ సమీపంలో నీరు నిల్వచేరుతోంది. దీంతో అటువైపుగా ఒకే సమయంలో వాహనాలు, పాదచారులు వెళితే తిప్పలు తప్పడం లేదు. వాహనాల వెళ్లేటప్పుడు మురుగునీరు పాదాచారులపై పడుతుండడంతో అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు అటువైపుగా వెళ్లాలంటేనే పలువురు సాహసించడం లేదు. వరుసగా రెండు మూడు రోజులు వాన వస్తే ఇక పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. నీరు నిల్వచేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిరు వ్యాపారుల అగచాట్లు

బంగారుపాళెం: మండలంలో గురువారం జడివాన పట్టుకుంది. దీంతో వ్యాపారులు, చిరు వ్యాపారులు, తోపుడుబండ్లతో వ్యాపారాలు సాగించుకుని జీవనం సాగించుకునేవారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. వ్యవసాయ పనులు చేసుకునే రైతులు, కూలీలు అవస్థలు పడ్డారు. కూలీనాలీ చేసుకునే వారి పనులకు ఆటంకం కలగడంతో పనులు మానుకుని ఇళ్లకు పరిమితం అయ్యారు. చలిగాలులకు వృద్ధులు, చంటి పిల్లలు అవస్థపడ్డారు. జడివాన కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ఈ జడివాన వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలిగించిందని, చెరువులకు నీరు చేరేలా భారీ వర్షం కురవలేదని రైతులు అంటున్నారు.

రోజంతా జడివాన

ఐరాల: బంగాళాఖాతంలో మరోసారి ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. జన జీవనం స్తంభించింది. పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు సెలవు ప్రకటించారు. ముసురు వర్షం కురుస్తుండడంతో చలి తీవ్రత పెరిగింది. వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయాలకు, కూలీ పనులకు వెళ్లే వారు రాకపోకలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని అతిపెద్ద చెరువైనా బీరప్పచెరవు నిండుకుండను తలపిస్తోంది. మొరవ పారుతుండడంతో చెరువు కింద గ్రామమైన మొరవవడ్డిపల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని జెండామాను వద్ద ఐరాల, పాటూరు ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి చిన్న నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఈ మార్గం గుండా వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు.




చిత్తూరు: అటవీశాఖ కార్యాలయ సమీపంలో వరద నీరు, బంగారుపాళెం: రోడ్డు పక్కన చిరు వ్యాపారుల అవస్థలు



నీటి కుంటలా బస్టాండు

తవణంపల్లె: తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన జడివానకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జనం అరుబయటకు రాలేక గృహాలకే పరిమితమయ్యారు. మూగ జీవాలు సైతం మేత కోసం బయటకు రాలేక షెడ్లకే పరిమితమయ్యాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినప్పటికీ వాగులు, వంకలు ప్రవహించలేదు. కుంటలు, చెరువులకు నీరు చేరలేదు. అరగొండ కొత్త బస్టాండులో వర్షపు నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. దీంతో బస్టాండులో వాహనాలు, ప్రజలు తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి కంది పంట, అలసంద, అనప పంట బాగా దెబ్బ తింటోంది. గ్రామీణ రోడ్లు, వీధులు బురదమయంగా మారాయి.






బంగారుపాళెం: రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు, తవణంపల్లె : కురుస్తున్న జడివాన, ఐరాల: నీటి కుంటను తలపిస్తున్న ఐరాల -పాటూరు ప్రధాన రహదారి





బంగారుపాళెం: వర్షంలో తాటిగేగుల విక్రేత, ఐరాల: నిండు కుండలా మారిన బీరప్పచెరవు, మొరవ సాగుతున్న బీరప్పచెరువు, తవణంపల్లె: వర్షానికి రాలిపోయిన కందిపూత

క్లుప్తంగా

డీసీసీబీ మేనేజర్‌కు సన్మానం



డీసీసీబీ మేనేజర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: స్థానిక డీసీసీ బ్యాంక్ మేనేజర్ గంగిరెడ్డిని గురువారం సాయంత్రం సిబ్బంది సన్మానించారు. గంగిరెడ్డి పదోన్నతిపై చిత్తూరు ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. గంగిరెడ్డిని బ్యాంకు సిబ్బందితో పాటు సింగిల్ విండో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. డీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా ఆయన రైతులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఈఓ రామ్మూర్తి, దీప, రాజశేఖర్, విజయ్, వినోద్, శివకుమార్, దుర్గాప్రసాద్, దేవేంద్రరాజు పాల్గొన్నారు.

189 కొత్తపల్లెలో వైద్యసేవలు



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ చంద్రమోహన్

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రమహేష్ 59 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి తగు సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సునీత, మోహన, అనిత, ఎలవతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అన్నదాత కోసం తరలిరండి

గుడిపాల: అన్నదాతకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాష్ గురువారం పిలుపునిచ్చారు. రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించే కార్యక్రమంలో అందరూ పాల్గొని సత్తా చాటాలన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



వృద్ధులకు జాగ్రత్తలు చెబుతున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: వర్షాకాలంలో జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. గ్రామాల్లో వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శుభ్రతతోనే వ్యాధులు దూరం అవుతాయన్నారు. గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం చేయడం మంచిదని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి లార్వాలను పారదోలాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న నరసింహ ప్రసాద్ వ్యక్తిగత పనులపై గురువారం నుంచి 15 రోజుల పాటు సెలవు పెట్టారు. దీంతో కార్పొరేషన్‌లో మునిసిపల్ ఇంజినీరుగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డిని అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆకట్టుకున్న హ్యాకథాన్



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: నగర సరిహద్దులోని ఆర్‌వీఎస్ నగర్‌లో ఉన్న ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను ప్రవేశపెట్టారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు మాట్లాడుతూ రెండు రోజుల పాటు తమ కళాశాలలో ఏర్పాటు చేసిన హ్యాకథాన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. వందలాది మంది విద్యార్థులు తమ మేథోశక్తిని ఉపయోగించి విభిన్న ప్రాజెక్టులను రూపొందించారని చెప్పారు. ఆ ప్రాజెక్టుల నిపుణుల బృందం పరిశీలించి విజేతలను ఎంపిక చేసిందన్నారు. ప్రతి విభాగంలో విజేతలుగా నిలిచిన బృందాలకు రూ. లక్ష చొప్పున నగదు బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిశోర వికాసం.. సాధికారతకు పునాది



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల

ఐరాల: కిశోర వికాసం కార్యక్రమం ద్వారా బాలికల సాధికారత సాధ్యమవుతుందని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి నిర్మల అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఒక రోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కిశోర వికాసం కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు పరచడంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల బాధ్యతలు వివరించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, విద్య ప్రాముఖ్యత, రుతుక్రమం, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, పోషకాహారం ప్రాముఖ్యత, మానవ విలువలు, యోగా, కరాటే యొక్క ప్రాముఖ్యత, పోక్సో చట్టం, బాలల చట్టాలను గ్రామస్థాయి అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. శిక్షణ పొందిన అధికారులు గ్రామ సచివాలయ పరిధిలో బడి బయట ఉన్న 11 నుంచి 18 ఏళ్లలోపు కిశోర బాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి ఆయా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి రెండో, నాలుగో శనివారం అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. మిగిలిన రోజుల్లో అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మహిళా పోలీసులు కన్వీనర్‌గా బాధ్యత వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుదామని, బాలల హక్కుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా బాలికల సాధికారతకు కృషి చేస్తామని సీడీపీఓ నిర్మల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర్‌నాయుడు, పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత, ఎస్ఐ నరసింహులు, ఏఓ భువనేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, మండల సచివాలయాల మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బంగారుపాళెం: స్థానిక బంగారుపాళెం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గురువారం తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కరిసే అవకాశం ఉందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు మొబైల్‌ను 8074172985 ను సంప్రదించాలని కోరారు.

రెండు సదస్సుల్లో 8 అర్జీలు

గుడిపాల: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రీరంగంపల్లె, 189 కొత్తపల్లెలో రెవెన్యూ సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ సదస్సుల్లో రైతులు 8 సమస్యలపై అర్జీలను సమర్పించారు. ప్రధానంగా ఆన్‌లైన్ అడంగల్‌లో భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, మిగులు భూములుగా నమోదు కావడం, ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు మారిపోవడం వంటి సమస్యలపై అర్జీలు వచ్చాయి.

వరసిద్ధుని సేవలో దాత



స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం ఆలయ పునర్నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనాలు అందజేసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, వాసు, చిట్టిబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 24 అర్జీలు



సదకుప్పం గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్

బంగారుపాళెం: గ్రామాల్లో నెలకున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని సదకుప్పం, నల్లంగాడు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సదకుప్పంలో నిర్వహించిన గ్రామ సభలో ప్రజల నుంచి 13 అర్జీలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్లంగాడులో నిర్వహించిన సభలో 11 అర్జీలు మొత్తం 24 వచ్చాయన్నారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామ సభలు చేపట్టినట్లు తెలిపారు.ఆర్ఐ మధుసూదన్, మండల సర్వేయర్ లావణ్య, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: మారుమూల ప్రాంతాలకు సైతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నారులకు జ్వరం సోకిన వెంటనే వైద్య పరీక్షలు చేయించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి కృషి చేద్దాం

యాదమరి (కాణిపాకం): బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సమష్టిగా పనిచేయాలని ఎంపీడీఓ వేణు, తహసీల్దార్ పార్థసారథి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల లోపు కిశోరబాలికల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని పేర్కొన్నారు. రక్తహీనత వంటి సమస్యలపై సూచనలు, సలహాలు ఇస్తూ పౌష్టిక ఆహారం అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలపై కలిగే అనర్థాలను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో రుక్మిణమ్మ, వైద్యులు శివకుమార్, వరప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మోసానికి లోన్ కావద్దు



- రుణ యాప్‌లతో భద్రం
- హామీ లేని రుణాలంటూ వల
- ఎక్కువగా మోసపోతున్న యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

బంగారుపాళెం: మేలెంచి కీడెంచాలని పెద్దలు చెప్పిన మాటలు ప్రస్తుతం నిజమనిపిస్తున్నాయి. సాంకేతిక విప్లవం కొన్ని సందర్భాల్లో గాడి తప్పుతోంది. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న మొబైల్ సాంకేతికత అనేక సందర్భాల్లో నిట్టనిలువునా ముంచుతున్నాయి. ప్రజల అవసరాలను, వారి బలహీనతలను ఆసరాగా తీసుకుని రుణ యాప్ నిర్వాహకులు పేట్రేగిపోతున్నారు. మండలంలో చాలా మంది బాధితులు బయటకు చెప్పుకోలేక మథనపడుతున్నారు. లోన్ యాప్ నిర్వాహకుల వలలో పడి అవస్థలు పడుతున్నారు.

ఫోన్లలో మభ్యపెట్టి..

మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారు అంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. ఇదేదో ఒకసారి చూస్తే పోలా అనుకుని వివరాలు చెబితేచాలు.. రుణం తీసుకునే వరకూ ఫోన్ చేసి, ఏదో విధంగా ఒప్పించి రుణాన్ని తీసుకునేందుకు మభ్యపెడుతున్నారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే, వడ్డీపై వడ్డీవేసి, రుణం సొమ్ము నుంచే ముందుగానే కొంత మినహాయించి ఇస్తున్నారని బాధితులు దగోలుపెడుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ఇలా చాలా మంది బాధితులు లోన్ యప్ సంఘటనకు గురై ఎవరికీ చెప్పుకోలేక ఆందోళన చెందుతున్నారు.

వేధింపులు ఇలా..

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు తీవ్రతరమవుతాయి. రుణ గ్రహీత మొబైల్ నంబర్లకు పరువు, ప్రతిష్టకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫోటోలు పంపుతారు. బెదిరింపులకు లెక్కచేయకపోతే రుణ గ్రహీత కుటుంబసభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు వాట్సాప్‌కు పంపుతారు. వీరి ఆగడాలను కొందరు బయట చెప్పుకోలేక నలిగిపోతున్నారు. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇలాంటి యాప్‌ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలను ఎంచుకుంటారు.

ఓటీపీ అడిగి..

బంగారుపాళెం పట్టాణానికి చెందిన వ్యాపారికి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి, మీ పాన్ కార్డుకి ఫోన్ నంబర్ లింక్ చేయాలంటూ ఓటీపీలు అడిగారు. రెండు సార్లు ఓటీపీలు చెప్పడంతో ఆ వ్యాపారి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.3 లక్షలు మాయమయ్యాయి.

- మండలంలోని సదకుప్పానికి చెందిన వ్యక్తికి జాబ్ ఇప్పిస్తామని చెప్పి ఫోన్ ద్వారా రూ.30 వేలు కాజేశారు.
- ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి ఏటీఎం కార్డు బ్లాక్ అయ్యిందని ఓటీపీ అడిగి ఆయన ఖాతా నుంచి రూ.3 లక్షల దోచేశారు. దీంతో బాధితులు చిత్తూరు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఇలా చాలా మంది మోసాలకు గురై క్రైమ్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.



ఒక్క క్లిక్‌తో..

మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. హామీ లేకుండా రుణం పొందండంటూ యాప్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎటువంటి హామీ లేదనడంతో యువకులు, సామాన్య ప్రజలు ఈ కల్లబొల్లి మాటలకు, ప్రకటనలకు ఆకర్షితులవుతున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్క సారి యాప్‌ల వలలో చిక్కితే బయటపడడం అసాధ్యంగా పరిణమిస్తోంది.

అప్రమత్తంగా వ్యవహరించాలి



స్మార్ట్ ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే వాటి జోలికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పండని అడిగితే జాగ్రత్త పడాలి. అపరిచిత వ్యక్తుల ఫోన్‌లకు సమాధానం ఇవ్వకండి. ప్రతి యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశారంటే ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లే. రుణ యాప్‌ల్లో అప్పులు తీసుకుని మోసపోవద్దు. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశపడవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రుణ యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

-శ్రీనివాసులు, సీఐ, బంగారుపాళెం

14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

తవణంపల్లె: మండలంలోని ఆరు ఇరిగేషన్ చెరువులకు సాగు నీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ, ఎన్నికల పరిశీలకులు సుజాత తెలిపారు. మండలంలోని గాజులపల్లె ఆనకట్ట సిస్టం, కుయ్యవంక ఆనకట్ట, మేడివంక చెరువు, రామన్న చెరువు, పుణ్యసముద్రం పెద్దచెరువు, పట్నం పెద్దచెరువులకు సాగునీటి వినియోగదారుల సంఘాల కమిటీలు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆయకట్టుదారులు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకొన్నారు. ఓటర్లు ద్వారా ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్తోపాటు ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు. గాజులపల్లె ఆనకట్ట సిస్టం కింద ఆయకట్టుదారులు 210 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల అధికారిగా అరగొండ విద్యుత్ శాఖ ఏఈ కిషోర్‌బాబును నియమించినట్లు తెలిపారు. కుయ్యవంక ఆనకట్ట సిస్టం కింద 93 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినత్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. మేడివంక చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నిర్వహణకు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ వ్యవహరిస్తారని ఈ చెరువు కింద 64 మంది ఓటర్లు ఉన్నారు. రామన్న చెరువు కింద 139 మంది ఓటర్లు ఉండగా ఎన్నికల అధికారిగా పీఆర్ ఏఈ జయచంద్రారెడ్డిని నియమించినట్లు వివరించారు. పుణ్యసముద్రం పెద్దచెరువు కింద 217 మంది ఓటర్లు ఉండగా ఎన్నికల అధికారిగా మండల ఈఓపీఆర్‌డీ రాఘవేంద్రరాజును నియమించినట్లు తెలిపారు. పట్నం పెద్దచెరువు కింద సాగునీటి వినియోగదారుల సంఘం పరిధిలో 127 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల అధికారిగా పైపల్లె విద్యుత్‌శాఖ ఏఈ కిరణ్‌కుమార్ ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. ప్రశాంతంగా పారదర్శకంగా కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ఓటర్లు, రైతులు సహకరించాలని కోరారు.

రూరల్ కార్యాలయం ప్రారంభం



రూరల్ డివిజన్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ గురువారం ప్రారంభించారు. ఈ పూజ కార్యక్రమంలో ఈఈలు సురేష్, మునిచంద్ర, జగదీష్, డీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాకు ఎస్ఈ కార్యాలయం మంజూరు కావడంతో ఇదివరకు గిరింపేటలో ఉన్న రూరల్ డివిజన్ కార్యాలయంలోనే కలిసి పాలన సాగించారు. ఉద్యోగుల విధి నిర్వహణకు కార్యాలయం సరిపోకపోవడంతో పాత కలెక్టరేట్‌లో భవనాన్ని మంజూరు చేశారు. వాటిని రూ.7 లక్షలతో మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజన్ పరిధిలో జీడీ నెల్లూరు, నగరి నియోజకవర్గంలో నగరి టౌన్, నగరి రూరల్, పానూరు, నింద్ర సెక్షన్లు వస్తాయి.